సంఖ్యలు 'సరి'యైన సరిసంఖ్య లబ్దమౌ
గణిత మదియెజూడ గమ్మతుండు,
బేసి సంఖ్యలైన బేసియౌ లబ్దము
మూర్తి గణిత రీతి, స్ఫూర్తి గీతి !

సంఖ్య 'నొకటి'తోడ సరిగ గుణించిన
సంఖ్యయదియె వచ్చు సరిగ నిజము,
తత్సమమగు సంఖ్య తలచు మొక్కటనియు
మూర్తి గణిత రీతి, స్ఫూర్తి గీతి !

కూడబెట్టుటనగ కూడికే యనదగు
తీసినంతయౌను తీసివేత,
పంచిబెట్టుటనగ భాగహారమదియు
మూర్తి గణిత రీతి, స్ఫూర్తి గీతి !

లెక్కసౌధమెక్క నక్కర ఎక్కముల్
పెక్కు చిక్కులన్ని పేలిపోవు,
శ్రద్ధతోడ గూడి శ్రమియించవలయును
మూర్తి గణిత రీతి, స్ఫూర్తి గీతి !

విస్తృతముగ నుండు విజ్ఞానఖనిలోన
గణిత రీతులన్ని ఖచ్చితముగ,
వాటి భేదమెరుగు వారిదే జ్ఞానము
మూర్తి గణిత రీతి, స్ఫూర్తి గీతి !

వేద గణితమన్న వేదాంతమే గాదు
వేద గణితమనగ వేగ గణన,
సూక్ష్మరీతులందు సులభ సాధ్యంబగు
మూర్తి గణిత రీతి, స్ఫూర్తి గీతి !

ప్రకృతి విస్తరిల్లె ప్రాచీన గణితమై
లెక్కగట్టి జూడ లెస్సగాను,
ప్రాభవమ్ము గాదె పరికించి జూడగా
మూర్తి గణిత రీతి, స్ఫూర్తి గీతి !

ఘనత గల్గి యుండు గణిత ప్రక్రియలెల్ల
అర్థశాస్త్రమందు నలఘు రీతి,
దేశ బడ్జెటిచ్చు ధీటుగా గణితమ్ము
మూర్తి గణిత రీతి, స్ఫూర్తి గీతి !

జ్ఞానతృష్ణ లేక, గణనయే జేయక
మేటి పద్ధతులను మేలుయనక,
సాధన కొరవడిన స్పష్టత కరువగు
మూర్తి గణిత రీతి, స్ఫూర్తి గీతి !

కఠినమైన లెక్క కష్టమని తలచక
నిష్ఠతోడ జేయ నిశ్చయముగ,
అట్టి లెక్క తెలియు నట్టివాడె ఘనుడు
మూర్తి గణిత రీతి, స్ఫూర్తి గీతి !

విస్తరించ మునుపు విదితమౌను రెండు
విలువ మూడుయౌను విస్తరించ
బహు సులభము చూడ బెర్నౌలి సూత్రము
మూర్తి గణిత రీతి, స్ఫూర్తి గీతి !

మూడు భుజములుండి మూలలు మూడున్న
కొలువ సమము మూడు కోణములను,
సాధ్యమౌను గీయ సమ బాహు త్రిభుజము
మూర్తి గణిత రీతి, స్ఫూర్తి గీతి !

మట్టిలోన నుండు మణులు మానితముగ
పెట్టి తూచవచ్చు బుట్టలోన,
అట్టి వాటి ధరను గట్టవచ్చు లెక్క
మూర్తి గణిత రీతి, స్ఫూర్తి గీతి !

ఆడి, పాడుటకని ఆరు (6) బయటకెళ్లు
మనసుదీర యెక్కు మంచెపై($\pi$)కి,
అచ్చెరువుగ నుండు ఆరు(6)ద్ర పురుగులు
మూర్తి గణిత రీతి, స్ఫూర్తి గీతి !

గణితశాస్త్రమంత ఘన సూత్రముల తోడ
కఠినమైనలెక్క కష్టమనక,
పగిది నెఱిగి ఫలితంబు జేకూరు
మూర్తి గణిత రీతి, స్ఫూర్తి గీతి !

'పూరి' మడచకున్న పూర్ణ వృత్త మౌను
అర్థవృత్త మౌను ఆదియె మడచ,
వరలు వృత్తమయ్యె వరదగూడుయె తాను
మూర్తి గణిత రీతి, స్ఫూర్తి గీతి !

సున్న హెచ్చు వేయ సున్న తోడనెపుడు
సున్న లబ్ధమౌను సూటిగాను,
'సున్న' తోకుదరదు చూడగా భాగించ
మూర్తి గణిత రీతి, స్ఫూర్తి గీతి !

అడుగు ముందుకేసి అభివృద్ధి సాధించు
సాధకునికి గణన సాధ్యమౌను,
ఇష్టపడగ మేలు కష్టమెప్పుడు గాదు.
మూర్తి గణిత రీతి, స్ఫూర్తి గీతి !

గణితమన్న భయము గలుగనీకుండగ
సులభ సరణి దెల్ప సూటిగాను,
అర్ధమొనరజేసి ఆసక్తి నింపగా
సలిపినాము కృషిని ఫలితమీయ !

గణితమెపుడు కాదు గందరగోళము
సూత్రమెరిగి చేయ సులభమగును,
సాధనమ్ము చేయ సాధ్యమే సర్వము
మూర్తి గణిత రీతి, స్ఫూర్తి గీతి !

దాగియున్న భయము దరినుండ బోదిక
చిత్తశుద్ధి తోడ చేయునంత,
గణితశాస్త్రమంత గమ్మత్తై కనిపించు
మూర్తి గణిత రీతి, స్ఫూర్తి గీతి !

గణిత సేద్యమందు జ్ఞాన ధాన్యము పండు
గణితశాస్త్రమెల్లగణితమంద్రు,
పట్టు వీడబోక పయనించు ముందుకు
మూర్తి గణిత రీతి, స్ఫూర్తి గీతి !

గులకరాళ్ళ పైన గుర్రాల బండిగా
గణగణమని మ్రోగు గంటవోలె,
గణితమెపుడుజేయు ఘనమైన సవ్వడి
మూర్తి గణిత రీతి, స్ఫూర్తి గీతి !

వేడి పెనము మీద వేసిన జలబిందు
చిటపట యని, యదియు చిందులేయ,
గణితమై ధ్వనించు గంభీరనాదము
మూర్తి గణిత రీతి, స్ఫూర్తి గీతి !

గణిత పద్ధతులను గణనజేయగ నెంచ
చిన్నతనమునందె చిత్తమూని,
ఎక్కములను ముందు చక్కగా నేర్పుడు
మూర్తి గణిత రీతి, స్ఫూర్తి గీతి !

తేనెటీగలన్ని తెలివిగా గూడుచు
తెట్టె బెట్టి నింపు తేనె తోడ,
షడ్భుజంపు గదుల చక్కగా నిర్మించి
మూర్తి గణిత రీతి, స్ఫూర్తి గీతి !

గణితమనిన జంకు కలనైన వలదులే
వదలకుండ చేయ వలయునెపుడు,
వెలికితీయు ప్రతిభ వెలుగొందు బ్రతుకంత
మూర్తి గణిత రీతి, స్ఫూర్తి గీతి !

జీవశాస్త్రమందు జీవకణ గణన
వాస్తుశాస్త్రమందు జాస్తిగాను,
అంతరిక్షమెల్ల నావరించె గణన
మూర్తి గణిత రీతి, స్ఫూర్తి గీతి !

ప్రతి దినంబొకపరి ప్రత్యేక కృషి సల్పి
ఎక్కములను జదువ మక్కువగను,
సులభమైన రీతి సుస్థిరమొందును
మూర్తి గణిత రీతి, స్ఫూర్తి గీతి !

గణితశాస్త్రమనగ గణన మాత్రమె గాదు
అన్ని శాస్త్రములకు నదియె మొదలు,
మంచి సూత్రములను మంత్రాలు గణితాన
మూర్తి గణిత రీతి, స్ఫూర్తి గీతి !

దూర, భారములను తీరగు రీతుల
ఎత్తునొంపు లెక్క లెల్ల గొల్వ,
గణితమే తప్ప నన్యము కాదులేదు
మూర్తి గణిత రీతి, స్ఫూర్తి గీతి !

కాల, దూరములను, కాలము, పనులను
లబ్ది కొలువవచ్చు లక్షణముగ,
చిటిక కాలమందె చిక్కుల ముడి విప్పి
మూర్తి గణిత రీతి, స్ఫూర్తి గీతి !

కొండయెత్తు నూర్ధ్వ కోణంబగును గొల్వ
నిమ్న కోణమౌను నీటిలోతు,
స్తంభమును నిలుపగ లంబముండు
మూర్తి గణిత రీతి, స్ఫూర్తి గీతి !

కోత మిల్లు కర్ర కొలత వేయడమన్న
కందకాల లెక్క కట్టుటన్న,
గణితశాస్త్రమిలను గణన జేయగలుగు
మూర్తి గణిత రీతి, స్ఫూర్తి గీతి !

బాటవేసిజూపె 'బాడ్మాసు నియమము'
అన్ని ప్రక్రియలకు నమరియుండు,
బాగ నేర్వవలెను బ్రాకెట్ల మర్మము
మూర్తి గణిత రీతి, స్ఫూర్తి గీతి !

'సరి'ని'సరి'ని గూడ(+) సరిసంఖ్యయెవచ్చు
'బేసి', 'బేసి' గూడ (+) బేసి రాదు,
'బేసి','సరి'నిగూడ(+) బేసి సంఖ్యయె వచ్చు
మూర్తి గణిత రీతి, స్ఫూర్తి గీతి !

వైద్య విద్యలోను వైవిధ్యముగనుండు
ఇంజనీరు విద్య నిమిడియుండు,
పాలిటెక్నికందు పలుచోట్ల గణితమే
మూర్తి గణిత రీతి, స్ఫూర్తి గీతి !

తరగతి గదిలోన తలదించుకోబోక
గణితశాస్త్రమరయ ఘనముగాను,
దినదినంబు బెరుగు దివ్యమౌనాసక్తి
మూర్తి గణిత రీతి, స్ఫూర్తి గీతి !

బీజగణితమనగ భీతిల్లబోకను
భారమనక మదిని బాధపడక,
నాణ్యమైన రీతి నాటాలి సూత్రాలు
మూర్తి గణిత రీతి, స్ఫూర్తి గీతి !

తోష మలరగను చతుర్విధ ప్రక్రియల్
నేర్చుకొనుట కొరకు నేర్పు తోడ,
సులభ పద్ధతులను శోధించి సాధించు
మూర్తి గణిత రీతి, స్ఫూర్తి గీతి !

రైలుకెదురు రైలు రన్నింగులో నుండ
రైలు వెనుక రైలు రయ్యు మనగ,
సాధ్యమౌ గణించ సాపేక్ష వేగముల్
మూర్తి గణిత రీతి, స్ఫూర్తి గీతి !

నదులలోన పడవ నడయాడురీతిని
గణితశాస్త్రమెపుడు గణనచేయ,
జలము లోతు గొల్వ జలధిలో సాధ్యమౌ
మూర్తి గణిత రీతి, స్ఫూర్తి గీతి !

సహజసంఖ్యలనగ సాగునొకటి తోడ
అంకగణితమందు నమరియుండ,
అంతమొందదెపుడు నటువంటి సమితియె
మూర్తి గణిత రీతి, స్ఫూర్తి గీతి !

నాణెమెగురవేయ నదిజూపు నొకప్రక్క
బొమ్మ, బొరుసులనగ బొద్దుగాను,
సంభవించు ఘటన సంభావ్యతను దెల్పు
మూర్తి గణిత రీతి, స్ఫూర్తి గీతి !

అమ్మజేయు రొట్టె అదియు వృత్తమగును
అర్ధవృత్త మనగ నందు సగము,
అమ్మ చేతి గాజునదియును వృత్తమే
మూర్తి గణిత రీతి, స్ఫూర్తి గీతి !

తియ్యనైన లడ్డు తీరైన గోళమే
అర్ధగోళ మనగ నందు సగము,
ఆడుకొనెడి బంతి నదియొక గోళమ్ము
మూర్తి గణిత రీతి, స్ఫూర్తి గీతి !

వ్యర్ధ భయముగల్గ నర్ధమేలేదులే
పట్టుబట్టి నేర్వ పటిమగల్గు,
వాయిదాలు వేయ ఫాయిదా శూన్యంబు
మూర్తి గణిత రీతి, స్ఫూర్తి గీతి !

నిచ్చెనానజేయ నింపుగా గోడకు
లంబకోణమౌను లక్షణముగ,
మూడు భుజములమరి ముద్దు త్రికోణమై
మూర్తి గణిత రీతి, స్ఫూర్తి గీతి !

కలుప వర్గములను కర్ణేతరమ్ముల
కర్ణవర్గమునకు కలుగు సమము,
పచ్చి నిజము దెలిపె బౌధాయనుడపుడు
మూర్తి గణిత రీతి, స్ఫూర్తి గీతి !


వ్యాసమందు సగము వ్యాసార్ధమౌనులే
వ్యాసమనగ జ్యాయె వాస్తవముగ,
లెక్కమించు జ్యాల లెక్కింపు గగనమే
మూర్తి గణిత రీతి, స్ఫూర్తి గీతి !

నాల్గు భుజములందు నాల్గు లంబాలతో
కర్ణముల కొలతలు కలుగు సమము,
సరిగ చెప్పవచ్చు చతురస్రమనుచును
మూర్తి గణిత రీతి, స్ఫూర్తి గీతి !

వృద్ధి మూడు రెట్లు వృత్తపు వ్యాసము,
చుట్టు కొలతయౌను చూడగాను,
యెడతెగని విలువగ యెప్పుడు పై $(\pi = 3.1416)$గా
మూర్తి గణిత రీతి, స్ఫూర్తి గీతి !

గణిత పద్ధతులను గణనజేయగ నెంచ
చిన్నతనమునందె చిత్తమూని
ఎక్కములను ముందు చక్కగ నేర్చువాడు
మూర్తి గణిత విధము స్ఫూర్తి నింపు !

తేనెటీగలన్ని తెలివిగా గూడుచు
తెట్టె బెట్టి నింపు తేనెతోడ
షడ్భుజంపు గదుల చక్కగా నిర్మించి
మూర్తి గణిత విధము స్ఫూర్తి నింపు !


నిచ్చెనానజేయ
నింపుగా గోడకు
లంబకోణమౌను
లక్షణముగ
మూడు
భుజములమరి
ముద్దు త్రికోణమై
మూర్తి గణిత రీతి
స్ఫూర్తి గీతి
ఘనత గల్గి యుండు
గణిత ప్రక్రియలెల్ల
అర్ధశాస్త్రమందు
నలఘు రీతి
దేశ బడ్జెటిచ్చు
ధీటుగా గణితమ్ము
మూర్తి గణిత రీతి
స్ఫూర్తి గీతి
Budget